మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## సమిష్టి కృషితో జాతరను విజయవంతం చేయాలి

### -మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

**పాపన్నపేట, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** సమిష్టిగా కృషి చేస్తూ ఏడుపాయల మహాజారతను విజయవంతం చేయాలని అధికారులను మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. బుధవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ దంపతులు ఏడుపాయలకు చేరుకోగా ఆలయ ఇఓ చంద్రశేఖర్ సాదరంగా స్వాగతం పలుకగా ఆలయంలో మంత్రి దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు సాగు జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా (ట్రాఫిక్, తాగునీరు, విద్యుత్, పరిశుభ్రత) చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా ప్రజలు సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో ఉండేలా కరుణించాలని అమ్మవారిని వేడుకున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టర్ వెంట మెదక్ ఆర్‌డిఓ రమాదేవి, తహసీల్దార్ సతీస్, ఆలయ ఇఓ చంద్రశేఖర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మహిళను హత్యచేసిన వ్యక్తిపై కేసు నమోదు

**వర్గల్, ఫిబ్రవరి 26 (ప్రభాతవార్త):** వర్గల్ మండలం అనంతగిరిపల్లి గ్రామానికి చెందిన దార యాదమ్మ(40) ఈనెల 15వ తేదీన ఇంటి నుండి వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆమె కుమారుడు దార సాయికుమార్ గౌరారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా అనంతగిరిపల్లి గ్రామానికి చెందిన బండ్ల చిన్న లస్మయ్యను విచారించారు. గజ్వేల్ ఏసిపి పురుషోత్తంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సంవత్సరన్నర క్రితం చిన్నలస్మయ్యకు యాదమ్మతో పరిచయం ఏర్పడి అది చనువుగా మారి పలుమార్లు ఇద్దరు శారీరకంగా కలిశారు. ఈ క్రమంలో ఆరు నెలల నుండి యాదమ్మ అతడిని పెళ్లిచేసుకోవాలని ఇబ్బంది పెడుతుండడంతో ఈనెల 15వ తేదీన మధ్యాహ్నం 2.30 గంటలకు ఆమెను మోటార్‌సైకిల్‌పై గజ్వేల్ పరిధిలోని కోమటిబండ వద్ద గల అడవిలోకి తీసుకెళ్లాడు. అక్కడ అతడు కల్లులో పురుగుల మందు కలిపి ఆమెకు ఇచ్చాడు. ఆ కల్లు తాగిన ఆమెను కింద పడేసి మెడ చుట్టూ చీరతో ఉరివేసి చంపినట్లు తెలిపారు. మృతురాలు షెడ్యూల్డ్ కులానికి చెందిన మహిళ కావడంతో హత్య నేరంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



దర్గాలో గంధం సమర్పిస్తున్న మంత్రి

## వట్‌పల్లి వెంకట్ ఖాజా ఆశ్రమంలో గంధం సమర్పించిన మంత్రి

**వట్‌పల్లి, ఫిబ్రవరి 26. ప్రభాతవార్త:** సద్గురు వెంకట ఖాజానాయబ్ దాస్ చిష్తి ఆశ్రమంలో 39వ ఉర్సులో వైద్య ఆరోగ్య, సైన్స్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ బుదవారం ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మంత్రికి ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. వేడుకలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల వారు కర్ణాటక, మహరాష్ట్ర నుంచి వేలాది మంది భక్తులు హాజరవుతారు. ఇందు కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా అర్టీసీ బస్సులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, మండల కాంగ్రెస్ నాయకులు యువజన కాంగ్రెస్ నాయకులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## శివుని ఆశీస్సులు ప్రజలపై ఉండాలి

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు

**సిద్దిపేట, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త ప్రతినిధి :** పరమశివుని ఆశీస్సులు ప్రజలపై ఉండాలని మాజీ మంత్రి,ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. బుధవారం మహాశివరాత్రి సందర్భంగా సిద్దిపేటలోని శ్రీఉమా పార్థివ కోటిలింగాల దేవాలయంలో స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. సిద్దిపేట రూరల్ వెంకటాపూర్ గ్రామంలోని శివాలయంలో జరిగిన కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. అలాగే నంగునూరు మండలంలోని ఖాతా గ్రామ శివారులోని శ్రీమహదేవ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు గుట్టపైకి నూతనంగా ఏర్పాటు చేసిన రోడ్డు మార్గాన్ని ప్రారంభించారు. అనంతరం హరీష్‌రావు మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. స్వామి వారి దయతో కెసిఆర్ నాయకత్వంలో ఈ ప్రాంతంలో కాళేశ్వరం జలాలు పరవళ్ళు తొక్కుతున్నాయని తెలిపారు.

**వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించాలి ...**

సిద్దిపేట శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయ స్వర్ణోత్సవ వార్షిక బ్రహ్మోత్సవాలపై మాజీ మంత్రి,ఎమ్మెల్యే హరీష్‌రావుపై సమీక్ష సమావేశం నిర్వహించారు.దేవాలయం 50 ఏళ్ల పూర్తిచేసుకున్న సందర్భంగా వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలని నిర్వహకులను కోరారు. అర్ధశతాబ్దపు వేడుకలు చిన్న జీయర్‌స్వామిచే జరగడం అదృష్టమని, ఇందులో భాగస్వామ్యం కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ వేడుకలకు తన వంతు సహాయంగా లక్ష రూపాయలు విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. ఇలా అందరు ముందుకు వచ్చి బృహత్కార్యంలో పాలు పంచుకోవాలని ఆయన సూచించారు.

## పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు

### పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ

**సిద్దిపేట, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త ప్రతినిధి :** సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటి పోలీస్ యాక్ట్ అమలులో ఉందని జిల్లా పోలీస్ కమిషనర్ డా.బి.అనురాధ తెలిపారు. ఈ నెల 27 నుండి మార్చి 14వ తేదీ వరకు అమలులో ఉంటుందని, ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తా రోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదని తప్పని పరిస్థితుల్లో అయితే సంబంధిత పోలీసు అధికారులను సంప్రదించాలని చెప్పారు. బంద్‌ల పేరిట సంస్థలను, కార్యలయాలను మూసివేయాలని ఒత్తిడితెచ్చి బెదిరింపులకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని సూచించారు.

## బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రమ

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 26,ప్రభాతవార్త :** బిసి సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా హుస్నాబాద్ పట్టణానికి చెందిన పబ్బు రమను నియమిస్తూ ఆ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గొర్ల అయిలేష్ యాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామక పత్రాన్ని పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమెకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య ఆదేశాల మేరకు రమకు ఈ అవకాశం కల్పించినట్లు వివరించారు. అనంతరం రమ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించిన జాతీయ అధ్యక్ష, కార్యదర్శులతో పాటు రాష్ట్ర నాయకత్వానికి సైతం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని హామీ ఇచ్చారు.

## నేడే ఎమ్మెల్సీ ఎన్నికలు

### ఎన్నికలకు సర్వం సిద్దం...పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సామాగ్రి...

### భారీ పోలీస్ బందోబస్తు

**రామాయంపేట మున్సిపాలిటీ, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :** మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు సర్వం సిద్ధమయ్యాయి,

గురువారం నాడు ఉదయం 8 గంటలకు ప్రారంభం కానున్న పోలింగ్‌కు గాను పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సామాగ్రి చేరుకున్నాయి. రామాయంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి బుధవారం నాడు పోలింగ్ బాక్సులు, సామాగ్రిని పోలింగ్ సిబ్బంది తీసుకువచ్చారు. ఇందుకు పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు. అందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సజావుగా పోలింగ్ నిర్వహించేందుకు గాను కళాశాలలోని గదులను ఏర్పాటు చేశారు. కాగా మండలంలో 950 మంది పట్టభద్రుల ఓటర్లు, 81 మంది ఉపాధ్యాయ ఓటర్లు గురువారం నాడు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు స్థానిక తహశీల్దార్ రజని కుమారి తెలిపారు. పోలింగ్ కేంద్రం వద్ద భద్రత దృష్ట్యా 100 మీటర్ల దూరం వరకు ఆంక్షలు విధించినట్లు పోలీసులు తెలిపారు.



రామాయంపేటలో పోలింగ్ బాక్స్‌లు, సామాగ్రితో పోలింగ్ సిబ్బంది

# దుర్గమ్మ, శివనామస్మరణతో దద్దరిల్లిన ఏడుపాయల

## అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి దామోదర్

**పాపన్నపేట, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** ముగ్గురమ్మల మూలపుటమ్మ.. మా తల్లి దుర్గమ్మ... మొక్కులు తీర్చే మాయమ్మ... హరిహర మహాదేవ... శంభో శంకర అంటూ భక్తులు దుర్గమ్మ, శివనామ స్మరణతో ఏడుపాయల గుట్టలు మార్మోగాయి. సప్త పాయలుగా ప్రవహించే మంజీరా నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి ఉపావాస దీక్షలు ఆరంభించారు. బుధవారం తెల్లవారు జామున అర్చకులు వనుదర్గామాత మూల విరాట్ విగ్రహానికి అభిషేకం నిర్వహించి ఆధ్యాత్మికత ఉట్టిపడేలా అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

**పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి దామోదర్...**

మహాశివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకుని మూడు రోజుల పాటు కొనసాగే మహాజాతర ఉత్సవాలను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి జాతర ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయానికి ఆయా ప్రాంతాల నుంచి భక్తులు మంజీర పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకుని మొక్కలు చెల్లించుకున్నారు.

**బోసిపోయిన ఘనపురం ఆనకట్ట...**

ఆలయానికి చేరుకోవడానికి ఒక కిలో మీటరు మేర నడవాల్సి రావడంతో వృద్ధులు, చిన్నారులు, మహిళలు అవస్థలు పడాల్సి వచ్చింది. ఆలయానికి తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు మూడు రోజుల పాటు ఆలయ పరిసరాల్లో ఉండేందుకు మూటముల్లెతో చేరుకోగా ధర్మసత్రాలు అందుబాటులో లేక భక్తులు ప్రయాసపడాల్సి వచ్చింది. ధర్మసత్రాలు లేకపోవడంతో భక్తులు గుడారాలు, టెంట్లు వేసుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆలయానికి చేరుకున్న భక్తులు జాతర ఉత్సవాల్లో రెండవ రోజైన గురువారం బండ్లు తిరిగే కార్యక్రమం, రథోత్సవంలో పాల్గొని అమ్మవారిని మరో మారు దర్శించుకుని తమ గమ్యస్థానాలకు చేరుకుంటారు.

**అద్బుతంగా ఆలయ అలంకరణ...**

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వన దుర్గాదేవి ఆలయాన్ని రంగురంగు పూలు, విద్యుత్ దీపాలతో అద్భుతంగా అలంకరించారు. స్వాగత ద్వారంనుంచి ఆలయం వరకు, ఘనపురం ఆలయానికి సంబంధించిన జాలీలను ఓంకార, స్వాస్థిక్ రూపాలతో, ధ్వజస్థంభాన్ని రంగురంగు పూలతో అందంగా ముస్తాబు చేశారు.

**పకడ్బందీగా ఏర్పాట్లు...**

మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఏడు పాయల ఆలయానికి ఆయా ప్రాంతాల నుంచి 12 లక్షల మంది భక్తులు వస్తారన్న అంచనాలతో అధికారులు తగు ఏర్పాట్లు చేశారు.భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు సింగూరు ప్రాజెక్టు నుంచి 0.35 టీఎంసిల నీటిని వనదుర్గా ప్రాజెక్టుకు విడుదల చేసి ఉన్నారు. ఘనపురం ఆనకట్ట కింద, స్నాన వాటికల వద్ద పుణ్యస్నానాలకు ఇబ్బందులు కల్గకుండా ఏర్పాటు చేశారు. కుళాయిలు, వాటర్ ట్యాంకర్‌లు ఏర్పాటు చేసి భక్తులు తాగునీటికి తహతహ లాడకుండా చర్యలు తీసుకున్నారు. తాగునీరు కలుషితం కాకుండా వైద్య సిబ్బంది ఘనపురం ఆనకట్ట, చెక్‌డ్యాం తదితర ప్రాంతాలలో క్లోరినేషన్ చేశారు. జాతర పరిసర ప్రాంతాల్లో భక్తులకు అనుగుణంగా మరుగుదొడ్లతో పాటు బాయోటాయిలెట్లు ఏర్పాటు చేశారు. విద్యుత్ అంతరాయం కల్గకుండా విద్యుత్ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.

**దేగకన్నులతో నిఘా...గట్టి భద్రత...**

మెదక్ జిల్లా ఎస్‌పి ఉదయ్‌కుమార్ రెడ్డి పర్యవేక్షణలో డిఎస్‌పి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు కొనసాగుతోంది. ఇద్దరు డిఎస్‌పిలు, 8 మంది సిఐలు జాతర పరిసర ప్రాంతాల్లో పర్యవేక్షణ చేస్తూ భక్తుల భద్రతకై పరిశీలన చేస్తున్నారు. పోలీసులతో పాటు సిసి కెమెరాలతో దేగకన్నుల నిఘాతో గట్టి బందోబస్తును నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా నీటి ప్రమాదాల నివారణకు మత్స్యశాఖ ఆధ్వర్యంలో 150 మంది గజ ఈత గాళ్లను అందుబాటులో ఉంచారు.

**తాగునీటి గోస...**

జాతరకు వచ్చిన భక్తులకు తాగునీటి గోస తప్పలేదు. తాగునీటి పారుదల శాఖ అధికారులకు అప్పగించిన బాధ్యతను అధికారులు, సిబ్బంది పట్టింపు లేకుండా వ్యవహరించడంతో భక్తులు తాగునీటికై పాట్లు పడాల్సి వచ్చింది.

**మురుగు తొలగని దొడ్లు...**

జాతరకు వచ్చిన భక్తులకు ఇబ్బందులు తప్పలేదు. మునిపుట్టకు వెళ్లే ఖాళీ ప్రదేశంలో నిర్మించిన మరుగుదొడ్లు శుభ్రం చేయకపోవడంతో మరుగుదొడ్లను భక్తులు వినియోగించుకోలేక బహిరంగ ప్రదేశాల్లో బహిర్భూమికి వెళ్లే దుస్థితి నెలకొంది.



వనదుర్గామాతకు పట్టువస్త్రాలు తీసుకెళుతున్న మంత్రి దామోదర్



విద్యుత్ దీపాలకంరణలో ఏడుపాయల క్షేత్రం

# పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

## -మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్

**సంగారెడ్డి బ్యూరో, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:** ఈ నెల 27వ తేదీన (నేడు) జరగనున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. బుధవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో పోలింగ్ ప్రక్రియ నిర్వహణపై, ఈ ప్రక్రియలో పాల్గొని పోలింగ్ నిర్వహించే అధికారులకు పూర్తి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల నిర్వహణలో ఓటర్లు స్వచ్ఛందంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా ఓటుహక్కు వినియోగానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక పీవో, ముగ్గురు వోపీవోల చొప్పున నలుగురు అధికారులతో కూడిన బృందం పోలింగ్ ప్రక్రియను జరిపిస్తుందని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు కలిగి ఉన్న ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. పోలింగ్ ముగిసిన మీదట బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రత నడుమ కరీంనగర్‌లోని రిసెప్షన్ సెంటర్‌కు చేర్చడం జరుగుతుందన్నారు. పోలింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ తగు సిబ్బందికి సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవోలు తూప్రాన్ జయచంద్రారెడ్డి, నర్సాపూర్ మహిపాల్ రెడ్డి, డీఈవో రాధా కిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, సంబంధిత పోలింగ్ నిర్వహించే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

## ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**

జిల్లా వ్యాప్తంగా జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీకి 56, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 15 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. సిద్దిపేట జిల్లా పరిధిలో 32వేల 5వందల 89 ఓట్లు పట్ట భద్రులు ఉండగా అందులో 3212 మంది టీచర్లు ఓటు హక్కును కలిగి ఉండగా వారు ఓటు హక్కును వినియోగించుకునేందుకు 63 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా అందులో పట్ట భద్రుల కోసం 40, ఉపాధ్యాయుల కోసం 23 కేంద్రాలను వేరు వేరుగా ఏర్పాటు నల్గొండ, ఖమ్మం టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు 166 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు నమోదు చేసుకోగా వారి కోసం 4 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలను జియో ట్యాగింగ్ చేయడంతో పాటు వెబ్ కాస్టింగ్ సైతం ఏర్పాటు చేశారు.ఈ పోలింగ్ విధులలో 700ల మంది సిబ్బంది 8 రూట్ మొబైల్ పార్టీలు,24 స్ట్రైకింగ్ ఫోర్స్ 45 ఎఫ్‌ఎస్టి,45 విఎస్టి టీమ్స్‌తో పాటు ముగ్గురు ఎసిపిలు,10 మంది సిఐలు,27 మంది ఎస్‌ఐలు67 మంది ఏఎస్‌ఐలు,312 మంది హెడ్ కానిస్టేబుల్లతో కలుపుకుని మొత్తం 419 మంది అధికారులతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.అయితే గురువారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ఈ పోలింగ్ జరుగనుంది.

## ఎమ్మెల్సీ ఎన్నికలకు పూర్తయిన ఏర్పాట్లు

### -ఆర్‌డిఓ అశోక్‌చక్రవర్తి

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** డివిజన్ పరిధిలోని కల్హేర్, సిర్గాపూర్, మనూర్, కంగ్టి, నిజాంపేట్, నాగలగిద్ద, నారాయణఖేడ్‌లో ఈ నెల 27వ తారీఖున జరగనున్న పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలను పురస్కరించుకుని అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్‌డిఓ అశోక్ చక్రవర్తి పేర్కొన్నారు. ఆయా మండలాలకు రూట్ల వారిగా బస్సులు ఏర్పాటు చేసి సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించామన్నారు. నారాయణఖేడ్ మండలంలో డిగ్రీ పట్టభద్రులు పురుషులు 1107మంది, మహిళా ఓటర్లు 301మంది, కల్హేర్ మండలంలో పురుషులు 309, మహిళలు 113 మంది, కంగ్టిలో 374 మంది పురుషులు, 73మంది మహిళలు, మనూర్‌లో 340 మంది పురుషులు, 79 మంది మహిళలు, నాగల్‌గిద్దలో 207 మంది పురుషులు, 45 మంది మహిళలు, నిజాంపూట్‌లో 256 మంది పురుషులు, 58 మంది మహిళలు ఓటు హక్కును కల్గి ఉన్నారు. నియోజకవర్గంలో 2846 మంది పురుషులు731 మంది పట్టభద్రులు ఓటు హక్కును పొంది ఉన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 287 మంది పురుషులు, 88 మంది మహిళ ఉపాధ్యాయులు ఓటు వేసేందుకు సిద్దంగా ఉన్నారు. డివిజన్ పరిధిలో 8 పోలింగ్ కేంద్రాల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయులు తమ ఓట్లను వినియోగించుకోనున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా సాగేలా డిఎస్‌పి వెంకట్‌రెడ్డి, సిఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐలు శ్రీశైలం, మొగులయ్యలు తమ సిబ్బందితో పర్యవేక్షించనున్నారు.



సిబ్బందికి ఎన్నికల సమాగ్రిని అందచేస్తున్న దృశ్యం

## శ్రీఉమామహేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**మర్కుక్, ఫిబ్రవరి 26 (ప్రభాతవార్త):** మహాశివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలపరిధిలోని అంగడికిష్టాపూర్‌లోగల శ్రీఉమామహేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతిపూజ, పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, అంకురార్పణ, రక్షాబంధనము, ఋత్విక్వరణం, సాయంత్రం 4 గంటల నుండి సామూహిక రుద్రాభిషేకములు, రాత్రి 7.30 గంటలకు నందివాహనసేవ, హారతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ బల్లి శ్రీనివాస్‌గుప్త, మాజీ సర్పంచ్ రాములుగౌడ్, మాజీ ఎంపిటిసి నరేందర్, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టారు. ఇదిలా వుండగా 27వ తేదీ గురువారం ఉదయం 7 గంటలకు ప్రాతఃకాల అభిషేకం,మాతృకాపూజ, నాంది, బ్రహ్మాది కళశ స్థాపన, అగ్ని ప్రతిష్ట, మూలమంత్ర హవనములు, సాయంత్రం 5.30 గంటలకు ప్రోదషకాల పూజ, సాయం ఔపాసనము, రాత్రి 7 గంటలకు నందివాహన సేవ, హారతి, తీర్థ ప్రసాద వితరణ, 28వ తేదీ శుక్రవారం పూజ, అభిషేకం, రుద్రహోమం, మూలమంత్ర హోమాలు, 9 గంటలకు ధ్వజారోహణం, గరుడ ప్రసాద వితరణ, 10 గంటలకు నందివాహనసేవ, ఎదుర్కోళ్ళు, 11.30 గంటలకు శ్రీఉమామహేశ్వరస్వామి కళ్యాణ హోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. అనంతరం బలిహరణం, సాయంత్రం 5 గంటలకు భేరిపూజ, గజవాహన సేవ, రాత్రి వీరముష్టి వారిచే ప్రభలు తీయుట, పుల్లూరు నాగరాజు తీగుల్ వారిచే అగ్నిగుండ ప్రవేశము ఉంటుందన్నారు. శనివారం శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామి వ్రతము, ఆదివారం మహా పూర్ణాహుతి, అవబృదము, మహాదాశీర్వచనము, ఋత్విక్‌సన్మానము, శ్రేయసంపాదనము, రాత్రి ఏకాంత సేవ, ఆధ్మాతిక, ధార్మిక సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. మూడు రోజుల పాటు ఆలయానికి విచ్చేసే భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

# పొట్లపల్లి దేవాలయాన్ని అభివృద్ధి చేస్తా

## రవాణా,బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 26,ప్రభాతవార్త** పొట్లపల్లి శ్రీస్వయంభూ రాజరాజేశ్వరస్వామి దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని రాష్ట్ర రవాణా బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం మహాశివ రాత్రి సందర్భంగా పొట్లపల్లిలోని రాజరాజేశ్వర స్వామి వారి దేవాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఇబ్బందులు కలగకుండా త్వరగా దర్శనం పూర్తయేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తులతో ముచ్చటించి ఏర్పాటు చేసిన సౌకర్యాలపై ఆరాతీశారు. దర్శనం అనంతరం పక్కనే ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపులో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ పొట్లపల్లి దేవస్థానానికి సిద్దిపేట జిల్లా భక్తులే కాకుండా ఇతర జిల్లాల నుండి కూడా భక్తులు వస్తారన్నారు. దేవాలయానికి 20 ఏళ్లుగా తాను దర్శనానికి వస్తున్నానని చెప్పారు. భక్తుల కోరికలు తీర్చే కొంగు బంగారం చేసే పుణ్య క్షేత్రం పొట్లపల్లి దేవాలయం అన్నారు. ఈసారి జాతర ఏర్పాట్లకు ఆరెపల్లి నుండి పొట్లపల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మించామని పొట్లపల్లి నుండి పందిల్ల వరకు డబుల్ రోడ్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.దేవాలయానికి వచ్చే భక్తులకు శాశ్వత తాగునీటి పరిష్కారం చేసామన్నారు.ఈ ప్రాంతంలోని ప్రాజెక్టులు అన్ని పూర్తయేలా సహకరించాలని ఆ భగవంతున్ని వేడుకున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ బొలిశెట్టి శివయ్య,సీనియర్ నాయకులు చిత్తారి రవిందర్, అక్కు శ్రీనివాస్ ఉన్నారు.



స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న మంత్రి పొన్నం ప్రభాకర

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

**నర్సాపూర్ రూరల్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధి తుజాల్‌పూర్ పంచాయతీ అర్జుతండాలో బుధవారం చోటుచేసుకుంది.నర్సాపూర్ ఎస్ఐ లింగం కథనం ప్రకారం... అర్జుతండాకు చెందిన హలవత్ గణేష్(42), వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. రెండు సంవత్సరాల క్రితం అప్పుచేసి కూతురు వివాహం జరిపించాడు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలవక మదనపడుతుండేవాడని కుటుంబసభ్యులు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ఇంటి నుండి బయటకువెళ్లి పొలంలోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య హలవత్ సాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగం తెలిపారు.

## లలితా పరమేశ్వరి దేవాలయంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్ పూజలు



పూజలు నిర్వహిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:** గాంధీనగర్ డివిజన్‌లోని పవిత్రమైన లలితా పరమేశ్వరి దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినోత్సవం సందర్భంగా బుధవారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిఆర్ఎస్ నేత ముఠానరేశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యువనేత ముఠాజైసింహా, సీనియర్ నేతలు ముఠా నరేశ్, ఎర్రం శ్రీనివాస్‌గుప్త, ముచ్చకుర్తి ప్రభాకర్, పోతుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆ ర్టీసిక్రాస్‌రోడ్స్ లక్ష్మీగణపతి దేవాలయంలో పూజలు నిర్వహించారు.

## తార్నాక జంక్షన్ పనులను పరిశీలించిన నగర ట్రాఫిక్ కమిషనర్ జోయల్ డేవిస్



తార్నాక జంక్షన్ పనులను పరిశీలిస్తున్న డి.జోయల్ డేవిస్

**తార్నాక, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త :** వారం రోజుల్లో తిరిగి ప్రారంభం కానున్న తార్నాక జంక్షన్ పనులను బుధవారం హైదరాబద్ జాయింట్ కమీషనర్ ఆఫ్ పోలీస్(ట్రాఫిక్) జోయల్ డేవీస్ పరిశీలించారు. ఇంకా కొన్ని అభివృద్ది పనులు పెండింగ్‌లో ఉండటంతో ఆయన వెంటనే జీహెచ్ఎంసీ అధికారులతో ఫోన్లో మాట్లాడి పెండింగ్ పనులను త్వరగా చేయించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన ట్రాఫిక్ ఏసీపి సంపత్‌కుమార్, నల్లకుంట ఇన్స్‌పెక్టర్ నర్సింగ్‌రావు, ట్రాఫిక్ విభాగం ఇంజనీరింగ్ సెల్ ఇన్స్‌పెక్టర్ భరత్ కుమార్ తధితరులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ కమీషనర్ జోయల్ డేవీస్ మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించేందుకు అనేక చర్యలు తీసుకోబుతున్నట్లు చెప్పారు.

## రోడ్డు వెడల్పుకు స్థల యజమానులు సహకరించాలి -డిప్యూటీ కలెక్టర్ అపర్ణ



రాజీవ్ రహదారి రోడ్డు వెడల్పు స్థల యజమానులతో సమావేశమైన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అపర్ణ తదితరులు

**కంటోన్మెంట్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ ప్యాట్నీ, జూబ్లీ బస్టేషన్ నుంచి శామీర్‌పేట్ వరకు నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో స్థలాలను కోల్పోతున్న యజమానులతో హైదరాబాద్ జిల్లా భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అపర్ణ సమావేశమైయ్యారు. తిరులగిరి తహశీల్దార్ కార్యాలయంలో రాజీవ్ రహదారి రోడ్డుకు ఇరువైపుల ఉన్న సస్థల యజమానులతో ఆమె సమావేశమైయ్యారు. ప్రభుత్వం చేపడుతున్న బృహత్తక కార్యక్రమానికి స్థల యజమానులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నష్టపోయే బాధితులకు ప్రభుత్వ పరంగా అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ రహదారి ప్రాపర్టీ ఓనర్స్ జేఏసి చైర్మన్ తేలుకుంట సతీష్ గుప్త తిరుమలగిరి తహశీల్దార్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాశీవిశ్వనాథుని సేవలో గాంధీనగర్ కార్పొరేటర్ పావనీ వినయకుమార్



పూజలు నిర్వహిస్తున్న గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ దంపతులు

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ దంపతులు కాశిలోని విశ్వనాథుని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు స్వామివారి సన్నిదికి చేరుకున్న అనంతరం పూజలు నిర్వహించారు. దేవదేవుని దీవెనలతో సుఖసంతోషాలతో ప్రజలందరు ఉండాలని కోరుతూ అందరికీ మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు.

## అభయాంజనేయ స్వామి దేవాలయంలో పూజలు



**అత్తాపూర్ ఫిబ్రవరి26, ప్రభాతవార్త :** మహా శివరాత్రి సందర్భంగా బుధవారం మానవ సేవే మాధవ సేవా సంస్థ చైర్మన్ ఏర్వ కుమారస్వామి మైలర్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆదర్శ కాలనీలో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో శివాలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకం చేసి, శివుని కృప అందరిపై ఉండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఏర్వ కుమారస్వామి మాట్లాడుతూ, "మహా శివరాత్రి అందరికీ శుభం కలిగించాలి. ఈ పవిత్రమైన పర్వదినం మన జీవితాల్లో కొత్త శక్తిని నింపాలి. ప్రతి ఒక్కరూ ధర్మపథంలో నడవాలని, ఈ అమృతకాలం మన సంకల్పాలకు కొత్త బలాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నాను," అని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు, స్థానికులు పాల్గొని శివభక్తితో పూజలు నిర్వహించారు.



బోయిన్‌పల్లి శివాలయంలో పూజలు చేస్తున్న జంపన ప్రతాప్ తదితరులు



మరకత లక్ష్మీ గణపతి ఆలయంలో పూజలు



ప్రత్యేక పూజల్లో మర్రిశశిధర్ రెడ్డి



శివాలయంలో పూజలు చేస్తున్న భజరంగ్‌సేనా అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త



శివాలయంలో పూజలు చేసిన ప్రజా ఏక్తాపార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌గుప్త



శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఏసీపీ గోపాలకృష్ణమూర్తి, సీఐ రామయ్యలు.



శివరాత్రి మహోత్సవాలలో పాల్గొన్న చార్‌కమాన్ షరాఫా అసోసియేషన్ ప్రతినిధి అజయ్ కుమార్ అగర్వాల్



శివకళ్యాణం నిర్వహించిన దృశ్యం



వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో క్యూలైన్‌లో భక్తులు

# భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి ఉత్సవాలు

**బోయిన్‌పల్లిలో**

**కంటోన్మెంట్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం బోయిన్‌పల్లిలోని బోలా శంకర్, కాశీ విశ్వేశ్వర ఆలయం, శివపంచాయతన ఆలయాలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరగడంతో ఆలయాలు భక్తులతో పోటెత్తింది. ఈ వేడుకల్లో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుర్గయ్య, అజిత్ కళ్యాణ్, రామారావ్, పిప్పరమెంట్ల శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

**అల్వాల్ పరిధిలో...**

**అల్వాల్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:** మహా శివరాత్రిని పురస్కరించుకుని శైవ క్షేత్రాలు భక్తులుతో కిటకిటలాడాయి. బుధవారం తెల్లవారు జాము నుంచే శివాలయాలు వద్ద ప్రజలు బారులు తీరారు. దేవుని అల్వాల్‌లోని ఉమా చంద్ర మౌళీశ్వరాలయం, కానాజీగూడాలోని మరకత లక్ష్మీ గణపతి ఆలయం, వెస్ట్ వెంకటాపురం రామలింగేశ్వర ఆలయాలు వద్ద భక్త జన సందోహం కనిపించింది. చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా స్వామి వారిని సందర్శించుకున్నారు.

**శ్రీ సిద్ది లింగేశ్వరస్వామి ఆలయంలో**

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వ దినమును పురస్కరించుకుని మాజీ మంత్రి, ఎన్‌డీఎంఏ మాజీ ఉపాధ్యక్షుడు, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు మర్రి శశిధర్‌రెడ్డి బన్సీలాల్‌పేట్ డివిజన్ నీలంబాలయ్య దొడ్డి ప్రాంతములో ఉన్న శ్రీ సిద్ది లింగేశ్వరస్వామి వారిని దర్శించుకుని, స్వామివారికి ప్రత్యేక అభిషేక కార్యక్రమము‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమములో స్థానిక బిజెపి నాయకులు యం. రఘునాథ్ గౌడ్, రామోజీ నర్సింగ్ రావు, హన్మంతరావు, సంతోష్, శ్రీనివాస్, మధు, శ్రీనాథ్, సోని, గుంటి సత్యనారాయణ, తుమ్మల శ్రీకాంత్, శ్యామ్ నాయుడు, కుమార్, నర్సింగ్ రావు, చంద్ర పాల్ రెడ్డి, మాంచాల గోపి, వికాస్, నరేష్, శ్రీమాన్, కె. శ్రవణ్, బొజ్జ నర్సింగ్ రావు, అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

**అఫ్జల్‌గంజ్‌లో**

**అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అఫ్జల్‌గంజ్‌లో అశోక్ బజార్‌లోని శివాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించి శివలింగానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు. కాగాగోషామహల్ నియోజకవర్గంలోని ఇసామియాబజార్, మంగళ్‌హాట్, హన్‌మాన్ టేకిడి, బేగంబజార్, కోఠి, దూల్‌పేట తదితర ప్రాంతాల్లో ఉన్న మందిరాలలో భక్తులు ప్రత్యేక పూజలను చేశారు. కాగా పలు దేవాలయాలలో భక్తులు తమ ఉపవాస దీక్షలను విరమించారు. దీంతో శివనామ్మసరణంతో పలు ప్రాంతాలు మోరుమోగ్రాయి. చిన్నబజార్‌లోని శివాలయంలో తెలంగాణ మైనార్టీ లింగ్విస్టిక్ సెల్ యూత్ చైర్మన్ అశోక్‌సింగ్ మురళీమోహన్ సింగ్ ప్రత్యేక పూజలు చేశారు.

**గోషామహల్ నియోజకవర్గంలో...**

**బేగంబజార్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గోషామహల్ నియోజకవర్గంలోని పలు మందిరాలలోబుధవారం తెల్లవారు జామునుండే భక్తి శ్రద్దలతో శివునికి పూజలను నిర్వహించారు. పలు ఆలయాలలో భక్తులతో కీటకీటలాడాయి. గౌలిగూడలో ఉన్న శివాలయంలో ప్రజాఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌గుప్త ప్రత్యేక పూజలను చేశారు. ఈసందర్భంగా ఆలయ నిర్వాహకులు తదితరలు పాల్గొన్నారు. కాగా గోషామహల్‌లోని చారిత్రాత్మకమైన శివాలయంలో కూడా పూజలు నిర్వహించారు. అనంతరందొంతారి మఠ్ దేవాలయం వివరాలపై ఎండోమెంట్, షాహినాయత్‌గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మార్చి1వతేది వరకు దేవాలయం భూమి వివరాలను అందచేస్తామన్నారు. దేవాలయాల భూములు గోషామహల్ నియోజక వర్గంలో అన్యాక్రాంతమవుతున్నట్లు చెప్పారు. అనేక మంది కబ్జాలు చేసుకుని బహుళ అంతస్దులు నిర్మించుకున్నట్లు బోనాలశ్రీనివాస్‌గుప్త ఆరోపించారు.

**బేగంపేట పరిధిలో...**

**బేగంపేట ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :** ఓ నమ:శివాయ హర హర మహాదేవ, శంభో శంకరా శివోహం అంటూ శివాలయాలు శివనామస్మరణతో మార్మోగిపోయాయి. శివరాత్రి సందర్భంగా ఆలయాలను వివిధ రకాలైన విద్యుద్దీపాలు, రంగు రంగుల పూలతో సుందరంగా ముస్తాబు చేసారు. శివరాత్రి సందర్భంగా ఉదయం నుంచే భక్తులు శివాలయాలకు పోటెత్తారు. బేగంపేట ప్రకాశంనగర్‌లోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో బేగంపేట ఏసీపీ పి.గోపాలకృష్ణమూర్తి, ఇన్స్‌పెక్టర్ చిర్ర రామయ్యలు పూజలు నిర్వహించారు. ఆలయంలో శివలింగానికి అభిషేకం నిర్వహించారు. శ్రీ శివపార్వతుల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం గం 5ల నుంచి రాత్రి గం 9ల వరకు దివ్యదర్శనము, ఉదయం గం 4ల నుంచి మధ్యాహ్నం గం 12.30నిల వరకు అభిషేకాలు, మధ్యాహ్నం గం 1.10నుంచి మధ్యాహ్నం గం 3లవరకు శివపార్వతుల కళ్యాణ మహోత్సవం, సాయంత్రం గం 6ల నుంచి రాత్రి గం 9ల వరకు పావని శిష్య బృందంతో కూచిపూడి నాట్య ప్రదర్శన రాత్రి గం 11లనుంచి ప్రత్యేక (లింగార్చన) మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. భక్తులు సంప్రదాయ వస్త్రాలతో పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తుల కోసం ఆలయ కార్యనిర్వహణాధికారి యం. విఠలయ్య, శ్రీభూలక్ష్మమ్మ ఆలయ నిర్మాణ దాత విశాల్ సుధాంల ఆధ్వర్యంలో పటిష్టమైన ఏర్పాట్లు చేసారు. అర్చకులు మఠం సదాశివుడు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి, ఇన్స్‌పెక్టర్లను విశాల్ సుధాం సత్కరించి తీర్ధ ప్రసాదాలను అందజేసారు. ఈ కార్యక్రమంలో శేఖర్ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎస్పీరోడ్డు శ్రీవీరహనుమాన్ ఆలయంలోని శ్రీఉమాముక్తేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలి వచ్చి స్వామి వారి అభిషేకం లో పాల్గొన్నారు. బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్ శ్రీహనుమాన్ దేవస్థానంలో కూడా మహాశివరాత్రి సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలి వచ్చి స్వామి వారి కి అభిషేకాలు నిర్వహించారు.

**పాతనగరంలో**

**చార్మినార్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతనగరంలో బుధవారం అత్యంత వైభవంగా శ్రీ మహ శివరాత్రి ఉత్సవాలు జరిగాయి. వేలాది మంది భక్తులు శివాలయాలలో పూజలు చేయటానికి రావటంతో కిక్కిరిసి పోయాయి. శివరాత్రి సందర్భంగా హైదరాబాద్ పాతబస్తీలోని అన్ని దేవాలయాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. అత్యంత పురాతనమైన కిషన్‌బాగ్ శ్రీ కాశీ బుగ్గ శివాలయంలో వేలాది మంది భక్తులు శ్రీ పరమ శివునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. మందిరం నుంచి ప్రధాన రహదారి వరకు భక్తులు క్యూలో నిలబడ్డారు. చార్మినార్ శ్రీ మహదేవ్ మందిరంలో భక్తులు ముప్పై ఒక్క వేల రుద్రాక్షలను పంపిణీ చేశారు. షరాఫా అసోసియేషన్ ప్రతినిధులు అజయ్ కుమార్ అగర్వాల్, తరుణ్ అగర్వాల్, దీపక్ అగర్వాల్‌తో పాటు పలువురు బంగారం వ్యాపారులు కలిసి భక్తులకు ఎటుంటి ఇబ్బందులు కలగకుండ ఏర్పాట్లను పర్యవేక్షించారు. పాతబస్తీలోని అనేక ప్రాంతాలకు చెంన వేలాది మంది భక్తులు మహాదేవ్ మందిరంలో శ్రీ పరమ శివునికి పూజలు జరిపారు.

**లక్ష్మీగణపతి దేవాలయంలో**

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:** ఆర్టీసిక్రాస్‌రోడ్స్ లో శ్రీ లక్ష్మీగణపతి దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. ఆలయ పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ నర్సింగరావు ఈవో లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరిగాయి. మహాశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం ఉదయం నుండి ఏకవారరుద్రాభిషేక మహోత్సవాలు, స్వర్ణపుష్పార్చనలు, అనంతరం ఉమామహేశ్వరస్వామి వారి కళ్యాణ మహోత్సవం నేత్రపర్వంగా సాగింది. అనంతరం మహాన్యాసపూర్వక రుద్రాభిషేక మహోత్సవాలను భక్తిశ్రద్దలతో నిర్వహించారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని శ్రీ క్షీరలింగేశ్వరస్వామివారి దర్శించుకుని పెద్దసంఖ్యలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జిల్లా శివకుమార్, మీసాల రాజేష్, డి భానుచందర్, గడప భాగ్యలక్ష్మి, సాయి కీర్థ్, గిరిబాబు, గుర్రం దినేష్, బద్రి నవీన్ కుమార్, సురేష్ యాదవ్, గుండ్ల గజానంద్, గణేష్, జి లలిత, రామకృష్ణ, జి శ్రీనివాస్, కే శివకుమార్, చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

**వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో...**

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:** మహాశివరాత్రి సందర్భంగా వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో ఉన్న శివాలయం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ సుధాకర్, ఈవో మాచర్ల దేవనాథం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాల సందర్భంగా మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ఏకవార రుద్రాభిషేక మహోత్సవాలు, హాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శివకళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయం ప్రధాన కార్యదర్శి బుగ్గాలక్ష్మీపతి, కందాళ వెంకటాద్రి, కమిటీ సభ్యులు కమిటీ సభ్యులు బి. పద్మావతి, ఎం. నిర్మల, ఎస్.నేత రాణి, కె.సుబ్బారావు, వివిఎస్.కుమార్, వి.శ్యామ్ కుమార్, ఎం. గణేష్, బాలాకుమార్, స్థానికులు సాయి చంద్, శ్రీనివాస్, ఆలయం అర్చకులు కాశీనాథ్‌శర్మ పాల్గొన్నారు.

# విజయ పాల బ్రాండ్ పేరుతో నకిలీ పాలు

**-విక్రయిస్తున్న వారిపై ప్రభుత్వం చర్యలు : చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి**

**-విజయ లోగో... బ్రాండింగ్ అనుకరించి చట్టవిరుద్దంగా రాష్ట్రంలో పాల విక్రయాలు...చైర్మన్**



తెలంగాణ విజయ బ్రాండ్ లోగోను చూపిస్తున్న చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి

**తార్నాక, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త :** విజయ బ్రాండ్‌ను వినియోగించుకుంటూ మార్కెట్లో ఉన్న ఇతర కంపెనీల పాలు విజయ బ్రాండ్ పేరుతో నకిలీ పాల విక్రయిస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకుంటామని తెలగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కో..ఆపరేటీవ్‌త ఫెడరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి హెచ్చరించారు. లాలాపేటలోని విజయ డెయిరీ ప్రధాన కార్యాలయం విజయ భవన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డెయిరీ ఎండీ చంద్రశేఖర్ రెడ్డి తో కలిసి చైర్మన్ గుత్తా అమిల్ రెడ్డి మాట్లాడారు. తమ తెలంగాణ విజయపాల బ్రాండ్‌తో నకిలీ విక్రేతలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నకిలీ విక్రేతల పట్ల వినియోగదారులు, పంపిణీదారులు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నామని తెలిపారు. తెలంగాణ పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్ (టీజీడీడీసీఎఫ్) కు సంబంధించిన విజయ బ్రాండ్ కాపీ చేసి ప్రైవేటు డైరీలు వాడడం నేరమని ఫెడరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి చెప్పారు. మాట్లాడుతూ తెలంగాణ కోపరేటివ్ సొసైటీ చట్టం 1964 ప్రకారం ఫెడరేషన్ ప్రారంభమైందని చెప్పారు. 2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం రాష్ట్రాల విభజన జరిగినప్పటి నుంచి రెండు రాష్ట్రాల్లో వేరువేరుగా సంబంధిత ఫెడరేషన్లు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని వివరించారు. విజయ బ్రాండ్ అనేది ఇప్పటికీ ఉమ్మడి హక్కుగానే ఉందని అన్నారు. మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీస్ యాక్ట్, 1995 ప్రకారం స్వయం ప్రతిపత్తి తో పనిచేస్తున్న జిల్లాల పాల యూనియన్లు విజయ బ్రాండ్ ను వినియోగించుకోవడానికి వీల్లేదని పేర్కొన్నారు. విజయ బ్రాండ్ ను వినియోగించుకునేందుకు ఏ జిల్లా యూనియన్లకు సైతం అనుమతించలేదని పేర్కొన్నారు. కానీ రెండు రాష్ట్రాలలోని కొన్ని జిల్లా యూనియన్లు విజయ బ్రాండ్ ను చట్ట విరుద్ధంగా వినియోగించుకుంటున్నాయని ఆరోపించారు. ఈ విషయమై ఇప్పటికే సిటీ సివిల్ కోర్టును తాము ఆశ్రయించగా విజయ బ్రాండ్ ను అనుకరించే ఏ ఉత్పత్తులను తయారు చేయడం, విక్రయించడానికి చేయకూడదని మధ్యంతర ఉత్తర్వులను రెండు రోజుల క్రితం జారీ చేసిందని తెలిపారు. ఇప్పటివరకు కర్నూలు జిల్లా పరస్పర సహాయ సహకార సంఘం, విఎన్ఆర్ డెయిరీ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, కృష్ణా జిల్లా పాల ఉత్పత్తి పరస్పర సహాయ సహకార సంఘం, శ్రీ సాయి దుర్గ ఎంటర్ప్రైజెస్, నెల్లూరు జిల్లా పరస్పర సహాయ సహకార పాల ఉత్పత్తి యూనియన్ లిమిటెడ్, ఆల్ రిచ్ డెయిరీ ప్రైవేట్ లిమిటెడ్, ఎన్ఎస్ఆర్ డెయిరీ ప్రైవేట్ లిమిటెడ్, విజయ మిల్క్ ప్రొడక్ట్స్, నార్మల్ మదర్ డెయిరీ తదితర సంస్థలు విజయ బ్రాండ్ ను అక్రమంగా వాడుకుంటున్నాయని తమ దృష్టికి వచ్చిందని వివరించారు. కోర్టు ఆదేశాల ప్రకారం పై సంస్థలతోపాటు ఏ ఇతర సంస్థలు విజయ బ్రాండ్ ను ఏ రకంగా వినియోగించినా చట్ట ప్రకారం శిక్షార్హులవుతారని చెప్పారు. తమ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత విజయ తెలంగాణ బ్రాండ్ పేరుతో తెలంగాణ పాడి రైతుల నుండి పాలు కొనుగోలు చేసి, నాణ్యమైన పాలు, పాల ఉత్పత్తులను ప్రజలకు అందిస్తోందని అన్నారు. విజయ బ్రాండ్ నాణ్యతకు, ప్రజల నమ్మకానికి చిరునామాగా మారిందని అభిప్రాయపడ్డారు. విజయ బ్రాండ్ ను వినియోగించుకుంటున్న ఇతర సంస్థల వలన ప్రజలు తమపై పెంచుకున్న విశ్వాసానికి విఘాతం కలిగే ప్రమాదం ఉందన్నారు. ప్రైవేటు డెయిరీలు నాణ్యత పాటించకుండా పాలు, ఇతర పాల ఉత్పత్తులను రూపొందించే ప్రమాదం ఉందని, తెలంగాణ ప్రజలు జాగ్రత్తగా ఉండి విజయ తెలంగాణ బ్రాండ్‌ను రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలోని వినియోగదారులు, విక్రేతలు, పంపిణీ దారులు అందరూ విజయ తెలంగాణ పాలు, పాల ఉత్పత్తులను మాత్రమే కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ఎలాంటి సందేహాలు, ఫిర్యాదులు ఉన్నా 9121160569 నెంబర్లో సంప్రదించాలని వారు సూచించారు.

# పట్టణ పాలనపై నేపాల్ ప్రతినిధులకు అంతర్జాతీయ శిక్షణ



**అత్తాపూర్ ఫిబ్రవరి26, ప్రభాతవార్త :** రాజేంద్రనగర్‌లోని ఎన్ఐఆర్‌డిపిఆర్‌లో విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేపాల్‌లోని ఎంపిక చేసిన పట్టణ స్థానిక సంస్థల ప్రతినిధుల కోసం 10 రోజుల శిక్షణా కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. మార్చి 7వ తేది వరకు జగనుంది. ఈ ఇందులో ప్రతినిధి బృందంలో 3 మేయర్‌లు మరియు 2 పట్టణ / గ్రామీణ ప్రభుత్వ అధికారులు మరియు 7 వివిధ ప్రాంతాలకు చెందిన నేపాల్ ప్రభుత్వ అధికారులు పాల్గొని పలు విషయాలను తెలుసుకున్నారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి మును మహావార్ మాట్లాడుతూ.... భారతదేశం మరియు నేపాల్ మధ్య బలమైన భాగస్వామ్యాన్ని నొక్కిచెప్పారు. అతని క్లుప్త ప్రసంగం సామర్థ్య నిర్మాణం యొక్క ప్రాముఖ్యతను నొక్కిచెప్పింది, ప్రత్యేకించి మానవ వనరుల అభివృద్ధిలో వ్యవసాయం ,ఉద్యానవనాలపై దృష్టి సారించడం మరియు ప్రతినిధి బృందం అవసరమని భావించిన ప్రత్యేక ఆసక్తి ఉన్న రంగాలు. ఈ కార్యక్రమం ద్వారా నేర్చుకోవలసిన అనుభవాలు మరియు పాఠాలను పంచుకోవడం ద్వారా ఈ కార్యక్రమం ఖచ్చితంగా ఉత్పాదకత మరియు రెండు దేశాలకు ప్రయోజనకరంగా ఉంటుందని విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. కేంద్రీకృత శిక్షణ కార్యక్రమాలు మరియు సందర్శనల మార్పిడి ద్వారా మరింత సహకారాన్ని పెంపొందించడానికి భారతదేశం యొక్క నిబద్ధతను ఆయన పునరుద్ఘాటించారు. అసోసియేట్ ప్రొఫెసర్ సెంటర్ ఫర్ పంచాయతీ రాజ్, వికేంద్రీకృత ప్రణాళిక సామాజిక సేవా డెలివరీ (సిపిఆర్‌డిపి, ఎస్ఎస్‌డి), ఎన్ఐఆర్‌డిపిఆరన, డాక్టర్ అంజన్ కుమార్ భంజా మాట్లాడుతూ....అంతర్జాతీయ శిక్షణ కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నందుకు ఎన్ఐఆర్‌డిపిఆర్ డైరెక్టర్ జనరల్ అయిన డా.జి నరేంద్ర కుమార్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పరిపాలన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికరణ (ఎస్‌డిజి) ప్రపంచీకరణ వ్యవసాయ ,ఉద్యానవనం ,మురుగునీరు పట్టణ వ్యర్థాల నిర్వహణ మరియు పర్యావరణ పర్యాటకం, ఇతర సంబంధిత అంశాలలో కొన్ని పట్టణ స్థానిక సంస్థలలో మంచి పద్ధతులను సందర్శించి అర్థం చేసుకోవాలని ప్రతినిధులకు తెలియజేశారు. ట్రైనింగ్ డిజైన్‌లో ఇవి ఖచ్చితంగా క్యాప్చర్ చేయబడ్డాయని వివరించారు. ప్రతినిధులను మహారాష్ట్ర, తమిళనాడు, హైదరాబాద్‌లకు తీసుకువెళ్లి మంచి విధానాలు ఉన్న ప్రదేశాలను బహిర్గతం చేయనున్నట్లు పేరొకన్నారు. మంచి అభ్యాసాల నుండి చాలా నేర్చుకోవాలని వీలైనంత వరకు తమ సొంత ప్రాంతాల్లో వాటిని పునరావృతం చేయాలని ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ మనోజ్ కుమార్, డైరెక్టర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ ,ఎన్ఐఆర్‌డిపిఆర్, సిఆర్‌పిడిపి ,ఎస్ఎస్‌డి ఫ్యాకల్టీ, ఇతర సినియర్ అధికారులు పాల్గొన్నారు

## శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు



శామీర్‌పేటలోని శివాలయంలో మహాశివరాత్రి సందర్భంగ భక్తులు శివున్ని దర్శించుకున్న దృశ్యం

**శామీర్‌పేట, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**

మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని బుధవారం వివిధ గ్రామాల్లో ఉన్న శివాలయాలు అన్ని కూడ ప్రత్యేక పూజలు జరిగి శివనామస్మరణతో మారుమోగాయి. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగ భక్తులు ఉపవాసాలు ఉండి సాయంత్రం శివాలయాలను, శైవాలయాలను సందర్శించి శివున్ని పూజించి దర్శించుకుని ఉపవాసదీక్షలు విడవటం జరిగింది. శామీర్‌పేట మండలంలో, మూడుచింతలపల్లి మండలంలో, తూంకుంట మున్సిపాల్టీలోనూ వివిధ గ్రామాల్లో ఉన్న శివాలయాలు మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని ఆలయాలను ముస్తాబు చేసి విద్యుత్ దీపాలతో పూలతో అలంకరణలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. శామీర్‌పేటలోని శ్రీభవాని రామలింగేశ్వరస్వామి (శివాలయం)లో ప్రధాన అర్చకులు గడియారం మురళీధర్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. శివాలయం భక్తులతో కిటకిటలాడింది. శివనామస్మరణతో ఆలయం మారుమోగింది. అదే విధంగ శ్రీవీరభద్రస్వామి ఆలయంలో మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని భక్తులు పెద్ద ఎత్తున విచ్చేసి శివున్ని దర్శించుకున్నారు. దేవరయాంజాల్, పోతాయిపల్లి, తూంకుంట, అంతాయిపల్లి, ఉప్పరిపల్లి, హకీంపేట్, సింగాయిపల్లి, మందాయిపల్లి, శామీర్‌పేట, మజీద్‌పూర్, తుర్కపల్లి, బొమ్మరాసిపేట్, బాబగూడ, పొన్నాల్, అలియాబాద్, లాల్‌గడిమలక్‌పేట్, జగ్గంగూడ, కేశవరం, నాగిశెట్టిపల్లి, మూడుచింతలపల్లి, లక్ష్మాపూర్, ఉద్దెమర్రి, అద్రాస్‌పల్లి, కొల్తూర్, అనంతారం, నారాయణపూర్, కేశ్వాపూర్, మురహరిపల్లి, యాడారం గ్రామాల్లో శివాలయాలు, రామాలయాలు, హనుమాన్ దేవాలయాలలో గ్రామాల్లోని భక్తులు మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని శ్రీస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయాలు అన్ని కూడ మహాశివరాత్రి పర్వదినంతో శివనామస్మరణతో మారుమోగాయి. వివిధ గ్రామాల్లోని శివాలయాల్లో, శ్రీభవాని రామలింగేశ్వరస్వామి ఆలయాల్లోనూ శ్రీస్వామి వారి కల్యాణోత్సవాలను నిర్వహించారు. ఆలయాల్లో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయాలు అన్ని కూడ భక్తులతో కిక్కిరిసి పోయాయి. ఇక గురువారం ఉదయం కూడ భక్తుల ఉపవాసదీక్షలు విరమణ ఉంటుండటంతో పలు ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలను కూడ నిర్వహించటానికి ఏర్పాట్లు చేశారు.



అత్తాపూర్‌లోని చిన్న అనంతగిరి శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎసిపి శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు

# ఘనంగా మహాశివరాత్రి వేడుకలు



మల్లికార్జునస్వామి ఆలయాన్ని దర్శించుకుంటున్న కార్పొరేటర్ పుష్ప

## మల్లికార్జునస్వామి ఆలయంలో కార్పొరేటర్ పూజలు

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ కొండగట్టుపై కొలువున్న భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి, జయలక్ష్మి నగర్‌లో నిత్యం భక్తులచే పూజలందుకుంటున్న శ్రీశ్రీశ్రీ శంభులింగేశ్వర స్వామి ఆలయాలను రామచంద్రాపురం కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ బుదవారం దర్శించుకున్నారు. ఆలయంలో అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా కార్పొరేటర్ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## శివాలయాలను దర్శించుకున్న ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మండల పరిధిలోని పంచగామ, బోరంచ గ్రామంలో శ్రీసంగమేశ్వరస్వామి ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేను అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు భోజిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, దిగంబర్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి ఉన్నారు.

## కాశీనాథ్ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** పట్టణంలోని కాశీ విశ్వనాథ్ ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి, టిఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహారెడ్డి శ్రేయరెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ జడ్పీటిసి సభ్యులు లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, పార్టీ పట్టణ అధ్యక్షుడు నగేష్‌సేట్, టిఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు అంజాగౌడ్, పార్టీ మండల యూత్ అధ్యక్షులు మచ్చేందర్, కురుమ సంఘం తాలుకా ఉపాధ్యక్షులు మల్గొండ, నాయకులు బసవరాజ్, చింటూ నగేష్, నరసింహులు, సంగమేష్, రమేష్ పాల్గొన్నారు.

## శివాలయంలో కార్పొరేటర్ పూజలు



బీరంగూడలోని శివాలయంలో పూజలు చేస్తున్న సింధూఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బీరంగూడోలోని శివాలయం, రామచంద్రారెడ్డి నగర్‌లోని శివాలయంలో భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ వన్నెవరం సింధూఆదర్శ్‌రెడ్డి కుటుంబసభ్యులతో కలిసి బుధవారం దర్శించుకున్నారు. ఆలయంలో అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా కార్పొరేటర్ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## మార్చి 7 నుంచి ఆలయాల్లో విగ్రహాల ప్రతిష్టాపన

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని మందుముల శ్రీనివాస్ నగర్‌కాలనీలోని ఆంజనేయస్వామి మందు ధ్వజస్థంభం, ఆలయ ఆవరణలోని రామాలయం, శివాలయం, సరస్వతిమాత ఉప ఆలయాల్లో మార్చి 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు విగ్రహాల ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు ప్రొద్దుటూరు లక్ష్మణ్ పేర్కొన్నారు. విగ్రహాల ప్రతిష్ఠాపనకై బుధవారం ఆలయంలో కమిటీ సభ్యులు, భక్తులతో సమావేశం అయ్యారు. మార్చి 7 నుంచి 9వ తేదీ వరకు ధ్వజస్థంబం ఏర్పాటుతో పాటు ఉప ఆలయాల్లో విగ్రహాల ప్రతిష్టాపన చేయనున్నట్లు ఆలయ పురోహితులు బాలకృష్ణ పేర్కొన్నారు. విగ్రహాల ప్రతిష్టాపన పూజలకు భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని దైవ కృపకు పాత్రులు కావాలని సూచించారు.

## కన్నుల పండువగా శివరాత్రి వేడుకలు

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకుని బుధవారం నియోజకవర్గంలోని శైవక్షేత్రాలు భక్తులతో సందడిగా మారాయి. పట్టణంలోని కాశీనాథ ఆలయం, పంచవటి, జుక్కల్ శివారులోని గుట్టలుళ్ల శివాలయాలకు భక్తులుచేరుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పంచగామలో శ్రీనాగలింగేశ్వరస్వామి ఆలయంలో సకల మత స్థాపకులు కాశీనాథ్‌బాబ ఆధ్వర్యంలో శివలింగానికి అభిషేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

**ఝరాసంగంలో...**



కేతకి సంగమేశ్వరుడి దర్శనానికి బారులు తీరిన భక్తులు

**ఝరాసంగం, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఝరాసంగంలో పార్వతీదేవి సమేతంగా కొలువున్న శ్రీ కేతకి సంగమేశ్వరస్వామి ఆలయం బుధవారం భక్తులతో అలరారింది. ఆలయానికి ఆయా ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని అమృతగుండంలో పుణ్యస్నానాలు ఆచరించి వరుస క్రమంలో వెళ్లి దైవ దర్శనం చేసుకున్నారు. ఆలయానికి తెల్లవారు జాము నుంచే కర్నాటక, మహారాష్ట్ర, ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఆయా ప్రాంతాల నుంచి భక్తులు చేరుకుని దర్శనం చేసుకున్నారు. ఉదయం అర్చకులు స్వామివారికి సుప్రభాత సేవ, మేల్కోల్పు, మహా రుద్రాభిషేకం, మహా మంగళహారతి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు, శివస్వామి మాలధారులు కాలినడకన ఆలయానికి చేరుకుని దైవ దర్శనం చేసుకున్నారు.

**ప్రముఖుల పూజలు...**

మహాశివరాత్రిని పురస్కరించుకుని శ్రీకేతకి సంగమేశ్వరస్వామి ఆలయాన్ని జిల్లా న్యాయమూర్తి భవానిచంద్ర, జహీరాబాద్ ఎంపి సురేష్ కుమార్ శెట్కార్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, డిసిఎంఎస్ ఛైర్మన్ మల్కాపురం శివకుమార్, మాజీ ఎంపి బిబిపాటిల్, కాంగ్రెస్ నాయకులు నీలం మధుముదిరాజ్, డాక్టర్ సద్దం ఉజ్వల్‌రెడ్డి, హనుమంతరావు పాటిల్, మాజీ మంత్రి చంద్రశేఖర్, మాజీ ఛైర్మన్ వై నరోత్తం, ఉదయ్ శంకర్‌పాటిల్‌లు దర్శించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

**జహీరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** ఈనెల 27న జరుగనున్న పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను పురష్కరించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. డివిజన్ పరిధిలో 7 పోలింగ్ కేంద్రాలు పట్టభద్రుల కొరకు, 6 పోలింగ్ కేంద్రాలు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కొరకు ఏర్పాటు చేశారు. జహీరాబాద్ డివిజన్‌లో 4544 మంది పట్టభద్రులు, 509 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును పొంది ఉన్నారు. పోలింగ్ సామాగ్రిని సిబ్బందికి అందించి పోలింగ్ కేంద్రాలకు చేరుకునేందుకు ఏర్పాటు చేసిన బస్సులను ట్రైనీ కలెక్టర్ మనోజ్, ఎఆర్ఓ, ఆర్‌డిఓపి రాంరెడ్డిలు జండా ఊపి బస్సులను పోలింగ్ కేంద్రాలకు పంపారు. ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని అధికారులు ఓటర్లకు సూచించారు.



స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు(ఇన్‌సెట్‌లో స్వామి, అమ్మవారు)



రామాయంపేటలో సీతయ్య గుడిలో క్యూ లైన్‌లో భక్తులు

**అమీన్‌పూర్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:** హరహర మహాదేవ.. శంభో శంకర అంటూ మహాశివరాత్రి సందర్భంగా బీరంగూడ శ్రీ భ్రమరాంబిక మల్లికార్జునస్వామి దేవాలయం మార్మోగింది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ గుట్టపై శ్రీభ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయంలో శివరాత్రిఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి ఉదయం ఐదు గంటలు నుంచే వేలాది మంది భక్తులు క్యూ లైన్‌లో వేచి ఉండటంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు భ్రమరాంబిక మల్లికార్జున స్వామివారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. శివనామ స్మరణతో ఆలయం మారుమ్రోగింది. శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజు బుధవారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం మహాన్యాస ఏకాదశ రుద్రాభిషేకం, ధర్మ దర్శనం, మహామంటపంలో ప్రత్యేక అభిషేకం సాయంత్రం వరకు నిర్వహించారు. సాయంత్రం ఏడు గంటల నుండి నవగ్రహ పూజ, హనుమత్ పూజ, అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, కుంకుమార్చన, హారతి తదితర కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. రాత్రి 11.45 గంటలకు అగ్నిగుండాలు నిర్వహించడంతో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. గుట్టపైకి వచ్చిన లక్షలాది మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది.

**రామాయంపేట మండలంలో...**

**రామాయంపేట, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :** బుధవారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రామాయంపేట మండలంలో ఉన్న శైవ క్షేత్రాలు భక్తులతో పోటెత్తాయి. ఉదయం తెల్లవారుజాము నుంచి భక్తులు శివాలయానికి వెళ్లి భక్తి శ్రద్ధలతో శివునికి అభిషేకాలను నిర్వహించారు. హర హర మహాదేవ....శంభో శంకర...అంటూ భక్తులు చేసిన నినాదాలతో దేవాలయాలు మార్మోగాయి. రామాయంపేట, నిజాంపేట మండలాల్లోని దాదాపుగా అన్ని గ్రామాల్లో ఉన్న శివాలయాల్లోకి భక్తులు, ప్రజలు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. రామాయంపేటలో ఉన్న శ్రీ రాజరాజేశ్వర దేవాలయం (సీతయ్య గుడి), నగరేశ్వర దేవాలయం, అయ్యప్పస్వామి దేవాలయ ప్రాంగణంలోని చిదానంద భువనేశ్వరాలయం(స్పటిక లింగం), శాంతమ్మ గుడి, మార్కండేయ మందిరం ఇంకా పలు దేవాలయాలకు భక్తులు వెళ్లి అభిషేకం నిర్వహించి, ఉపవాస దీక్షలు విరమించారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

## కురుమలు అన్ని రంగాల్లో ముందుండాలి

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**చేర్యాల, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :** కురుమలు అన్నిరంగాల్లో ముందుండాలని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. బుధవారం బచ్చన్నపేట మండలం సిద్ధుల గుట్ట దేవాలయ ఆవరణలో కురుమ సంఘం క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటి ఛైర్మన్ భానుక శివరాజ్, చేర్యాల మార్కెట్ కమిటి ఛైర్‌పర్సన్ నల్లనాగుల శ్వేత వెంకన్న, సిద్దిసేట జిల్లా కురుమ సంఘం ప్రధాన కార్యదర్శి అందె నాని, కురుమ రాష్ట్ర నాయకులు అందె బీరన్న, అందె అశోక్, జంగిలి యాదగిరి, మీస సత్యనారాయణ, సూర్న శ్రీశైలం, కామల్ల అనిల్, మార్కెట్ కమిటి డైరెక్టర్ బండారి కనకయ్య, సూర్న శ్రీకాంత్, మీస పార్వతి, గౌండ్ల శ్రీనివాస్, చిగుళ్ల రాములు, కదారి నవీన్, రాజు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు

**కొల్చారం, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:** మండల కేంద్రంతో పాటు రంగంపేట, వరిగుంతం చిన్నఘనపూర్, పైతర, కిష్టాపూర్, రాంపూర్, సంగాయిపేట, యనగండ్ల, పైతర, తుక్కాపూర్, కోనాపూర్, అసాన్ పల్లి, కొంగోడు, పోతిరెడ్డిపల్లి, జలాల్‌పూర్ తదితర గ్రామాలలో మహా శివరాత్రి పురస్కరించుకుని ప్రజలు, భక్తులు భక్తిశ్రద్ధలతో శివాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రమైన వీరభద్ర, భద్రకాళి, రుక్మిణి, విఠలేశ్వర, విఘ్నేశ్వర, శ్రీ ఆంజనేయ స్వామి సంహిత ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అర్చనతో ప్రారంభమై సాయంకాలం ఆలయ ఆవరణలో వీరభద్ర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్‌లో ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

**గజ్వేల్, ఫిబ్రవరి 26 (ప్రభాతవార్త):** మహాశివరాత్రిని పురస్కరించుకొని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌పరిధిలోని శ్రీఉమామహేశ్వరాలయం, ప్రజ్ఞాపూర్‌లోని శ్రీపార్థివేశ్వరాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని వివిధ ఆలయాల్లో శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించగా ఉదయం నుండే భక్తులు పెద్దసంఖ్యలో బారులుతీరారు. ఉపవాస దీక్షలు పాటించే భక్తులు సాయంత్రం ఆలయాలకు చేరుకొని స్వామివారికి అభిషేకంతో పాటు పూజలు నిర్వహించి దీక్షను విరమించడం జరిగింది. ఇదిలా ఉండగా ప్రజ్ఞాపూర్‌లోని శ్రీ పార్థివేశ్వరాలయంలో బిఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, సీనియర్ నాయకులు మర్కంటి కనకయ్య, గుంటుకు రాజు, మన్నె వెంకటేష్, ఎల్ల వెంకటేష్, ఎక్కలదేవ్ కనకయ్య, రమేష్, తుమ్మ శ్రీను, నర్సింలు, కుర్రె మహేందర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, తుమ్మ ఉపేందర్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## వీరభద్ర స్వామి ఆలయంలో పండ్ల పంపిణీ..

**కొల్చారం, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:** మహా శివరాత్రి పండగను పురస్కరించుకొని కొల్చారంలోని వీరభద్ర, భద్రకాళి, రుక్మిణి, విఠలేశ్వర, వినాయక, ఆంజనేయస్వామి ఆలయాల్లో బుధవారం శివరాత్రి ఉపవాస దీక్షలో పాల్గొన్న భక్తులందరికీ వీరభద్ర ఆలయ ఉత్స కమిటీ ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు ర్యాగళ్ల ఆనంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ అధ్యక్షులు వనమాల అనిల్ కుమార్, కమిటీ సభ్యులు పోచయ్య, వై. కృష్ణ, జట్టబోయిన శ్రీశైలం, ఆలయ పూజారి మహేష్ అప్ప, కమిటీ సభ్యులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



సోమేశ్వరాలయం వద్ద నిర్వహించిన కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

## భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** మహా శివరాత్రి వేడుకలు మండల వ్యాప్తంగా ఘనంగా ప్రారంభమయ్యాయి. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో పరమశివుడిని కొలుస్తూ రుద్రాభిషేకాలు, హోమాలు, భక్తి శ్రద్దలతో ప్రత్యేక పూజలను భక్తులు నిర్వహించారు. అలాగే మండల కేంద్రమైన చిన్నశంకరంపేటలోని శ్రీ సోమేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా మొదటి రోజు, గణపతి, నాగుపూజ, రుద్రాభీషేకం, అభిషేకం, మంగళహారతి, మంత్రపుష్పం వంటి కార్యక్రమాలు చేపట్టగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే రుద్రారంలోని సంగమేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో గణపతి పూజ, దీపారాధన, రుద్రాభీషేకం, వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

## సికింద్లపూర్‌లో యదేచ్ఛగా అక్రమ ఇసుక రవాణా

**హత్నూర, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త :** హత్నూర మండలం సికింద్లపూర్ గ్రామంలో ఇసుక అక్రమ రవాణా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూముల నుండి మట్టిని తీసి అక్రమ పద్ధతిలో ఇసుకను ఫిల్టర్ చేసి బహిరంగంగా రవాణా చేస్తున్న అధికారులు పట్టించుకోవడమే గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోని కిందికుంట నుంచి మట్టిని తీసుకొచ్చి చెరువులో ఫిల్టర్ చేస్తున్నారని, ఇది బహిరంగ రహస్యం అయినప్పటికీ సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదని, ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని, దీనితో ఇసుక అక్రమ రవాణా యదేచ్ఛగా జరుగుతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఫిల్టర్ చేసిన ఇసుకను స్టాకు చేసి టిప్పర్లలో విక్రయిస్తున్నారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణా అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఆరు నెలల నుంచి తాగునీటికి కటకట

**కొల్చారం, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కొల్చారం గ్రామంలోని 9వ వార్డులో గత ఆరు నెలల నుండి తీవ్ర మంచినీటి ఎద్దడి నెలకొంది. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శికి ఆరు నెలలుగా ఫిర్యాదులు వచ్చినప్పటికీ ఏమాత్రం స్పందించడం లేదు. ఈ విషయం ఎంపీడీవో కృష్ణవేణి దృష్టికి తీసుకెళ్లినా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. బోరుబావిలో ఉన్న సింగల్ ఫేస్ మోటర్ మార్చడానికి పంచాయతీ కార్యదర్శి అంజయ్య నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. శివరాత్రి పండగ పర్వదినం సందర్భంగా తొమ్మిదవ వార్డు ప్రజలు నీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా ఉండకుండా పంచాయతీ కార్యదర్శి సిద్దిపేట నుండి వారానికి ఒకసారి, పదిహేను రోజులకు రెండు సార్లు వస్తూపోతూ తన విధులను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎండాకాలం సమీపిస్తున్న రోజుల్లో త్రాగునీరు, ఇంట్లో వివిధ అవసరాల నిమిత్తం వాడుకోవడానికి సమీపంలో నీరు లేకపోవడంతో దూర ప్రాంతాల నుండి నీళ్లు తెచ్చుకోవడానికి 200 కుటుంబాల ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇట్టి విషయంపై అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని, లేకపోతే జిల్లా కలెక్టర్, ఇత ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తామని స్థానిక ప్రజలు తెలిపారు.



పనిచేయని సింగిల్ ఫేజ్ మోటారు

## కొప్పోల్ ఆలయ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

**పెద్ద శంకరంపేట, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:** కొప్పోలు ఉమా సంగమేశ్వర ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ రెడ్డి అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా బుధవారం మండలపరిధిలోని శ్రీకొప్పోల్ ఉమాసంగమేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు ఎమ్మెల్యే సంజీవరెడ్డి దంపతులను పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో విలసిల్లాలని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. కొప్పోల్ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని, కొప్పోల్ దేవాలయానికి బీటీరోడ్డు మంజూరైందని, మండలంలో మొదటి ప్రాధాన్యతగా తీసుకొని టెండర్లను ఆహ్వానించి త్వరలోనే బీటీ రోడ్డు పనులు పూర్తి చేస్తామన్నారు. అనంతరం కొప్పోల్ ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపు, పోలీస్ క్యాంపు, రెవెన్యూ క్యాంపులను పరిశీలించి జాతర ముగిసే వరకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులను ఆలయ కమిటీ సభ్యులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పద్మ బాపిరాజు, రాజశేఖర్‌రెడ్డి, సంగమేశ్వర్, శంకరయ్య, పరమేశ్వర్‌రెడ్డి, రాయిని మధు, నాయకులు నారా గౌడ్, సంగమేశ్వర్, సుభాష్‌గౌడ్, పెరుమాండ్ల గౌడ్, రాజేందర్‌గౌడ్, సాయిరెడ్డి, రఘుపతిరెడ్డి ఉన్నారు.



కొప్పోలు ఉమా సంగమేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి దంపతులు



బిఆర్ఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

## బిఆర్ఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం మాజీ శాసన సభ్యులు మహారెడ్డి భూపాల్‌రెడ్డి క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో టిఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహారెడ్డి శ్రేయరెడ్డి, మాజీ జడ్పీటిసి సభ్యులు లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, పట్టణ పార్టీ అధ్యక్షులు నగేష్ సేట్, టిఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షులు అంజాగౌడ్, పార్టీ మండల యూత్ అధ్యక్షులు మచ్చేందర్, కురుమ సంఘం తాలుకా ఉపాధ్యక్షులు మల్గొండ, నాయకులు బసవరాజ్, చింటూ నగేష్, నరసింహులు, మన్నాన్, నారాయణ, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

## శివాలయాల్లో భక్తుల పూజలు

**చౌటకూరు, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినాన్ని ఉమ్మడి పుల్‌కల్ మండలంలో ప్రజలు భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని శివాలయాలకు చేరుకుని ఆలయ అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాలు శివనామస్మరణతో మార్మోగాయి. శివంపేట, మిన్‌పూర్, గొంగ్లూర్, పెద్దారెడ్డిపేట గ్రామాల్లో శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయాలు, కోర్పోలులోని శ్రీమహాదేవాలయం, చౌటకూరులోని శ్రీ అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వరాలయం, ముదిమాణిక్యంలోని భోగేశ్వరాలయం, కోడూర్‌లోని శ్రీ ఉమానాగలింగేశ్వరాలయం, చిక్రియాల్‌లోని శ్రీలక్ష్మీ అనంత పద్మనాభస్వామి, శ్రీ రామలింగేశ్వర ఆలయాలను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలను రంగు రంగు పూలతో, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.

**నాగల్‌గిద్దలో...**

**నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినాన్ని మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలు భక్తిశ్రద్దలతో జరుపుకున్నారు. గ్రామాల్లోని ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన నాగల్‌గిద్దలోని శివాలయానికి గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు చేరుకుని పూజలు నిర్వహించారు.

## కేతకి ఆలయానికి శివస్వాముల పాదయాత్ర

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకుని ఆయా గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం, రాఘవాపూర్ గ్రామ శివారులోని పంచవటి క్షేత్రంలో కొలువున్న ద్వాదర జ్యోతిర్లింగాల ఆలయం, రేజింతల్ శివారులోని శ్రీ సిద్ధివినాయక ఆలయం, మల్గి గ్రామ శివారులోని శ్రీ సిద్దేశ్వర ఆలయం, గంగ్వార్‌లో శ్రీ రామలింగేశ్వర ఆలయం, రాంతీర్థంలో పాండురంగ స్వామి ఆలయాలు భక్తులతో అలరారాయి. ఆలయాలకు చేరుకున్న భక్తులు అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## మల్లికార్జున స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే



మల్లికార్జున స్వామిని దర్శించుకుంటున్న మహిపాల్‌రెడ్డి దంపతులు

**అమీన్‌పూర్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:** మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో బుధవారం ఉదయం పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే జీఎంఆర్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీరంగూడ భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవాలయాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకుని వెళ్తున్నామని తెలిపారు. శివరాత్రి సందర్భంగా భారీ సంఖ్యలో హాజరవుతున్న భక్తుల సంఖ్యకు అనుగుణంగా పూర్తి ఏర్పాట్లు చేశామని తెలిపారు. అనంతరం మంజీర నగర్ కాలనీలోగల మల్లికార్జునస్వామి, రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, బీరంగూడ ఆలయ కమిటీ ఛైర్మన్ సుధాకర్ యాదవ్, మాజీ ఛైర్మన్ తులసి రెడ్డి, ఆలయ ఈవో శశిధర్, నర్రా భిక్షపతి, కొమరగూడెం వెంకటేష్, వెంకన్న, రాజు పాల్గొన్నారు.

## శివనామ స్మరణతో మార్మోగిన శివాలయాలు...

**టేక్మాల్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త :** శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని టేక్మాల్ మండల పరిధిలోని బొడ్మట్‌పల్లిలో శ్రీభద్రకాళీ వీరభద్ర సమేత దేవాలయంలో, వెల్పుగొండలో శ్రీ తుంబురేశ్వరుని ధనురాలోని శ్రీకాశీవిశ్వేశ్వర ఆలయం, టేక్మాల్ శ్రీరామేశ్వరాలయంతోపాటు శివాలయాలన్నీ శివనామ స్మరణతో మార్మోగాయి. శివరాత్రి రోజున భక్తులు జాగరణ ఉండి భక్తిశ్రద్ధలలో ఒక పొద్దు ఉండి శివునికి పూజలు, అభిషేకాలు, అర్చనలు చేస్తారు. శివుడు అభిషేక ప్రియుడు కనుక ఉపవాస దీక్ష, జాగరణలు శివరాత్రి ప్రత్యేకతలు. ఉపవాసం అంటే కేవలం ఒంటిపూట భోజనం మాత్రమే కాదు, భూషణం, సాత్విక ఆహారం తీసుకోవటం, శారీరక మానసిక శౌచలం కలిగి ఉండటం అవసరం. ప్రదోష వేళ అంటే సూర్యాస్తమయం, చంద్రోదయానికి మధ్య కలం నుండి శివుడికి అభిషేకం, పూజలు అర్ధరాత్రి లింగోద్భవ సమయం వరకూ అభిషేకాలు చేశారు. శివరాత్రిని భక్తులు ఘనంగా జరుపుకున్నారు.

## ఘనంగా మహా శివరాత్రి వేడుకలు

**వెల్దుర్తి, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:** మహా శివరాత్రి పురస్కరించుకొని మండలంలోని శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో బుధవారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే స్నానాలు ఆచరించి నూతన వస్త్రాలు ధరించి ఉపవాస దీక్షలు చేపట్టారు. అనంతరం సాయంత్రం వేళ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో భక్తులు విశేషంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఒకపొద్దులను విడిచారు. శివరాత్రి పర్వదినాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు.



భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

## ఖేడ్‌లో 9 వాహనాలు సీజ్

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** పట్టణంలో బుధవారం వాహనాల తనిఖీ చేయడం సరైన ధ్రువపత్రాలు లేని 9 వాహనాలు సీజ్ చేసినట్లు ఆర్టీఏ మహేశ్‌కుమార్ తెలిపారు. వాహన చోదకులు వాహనానికి సంబంధించి పత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ అందుబాటులో ఉంచుకుని తమ వాహనాలను రోడ్డుపై తోలాలన్నారు. పత్రాలు లేకుండా రోడ్డెక్కిన వాహనాలను సీజ్ చేస్తామని ఆర్‌టిఏ మహేశ్‌కుమార్ హెచ్చరించారు.